

# యువరాజు–తరాజు

సాకేతపురి మహారాజు త్రివిక్రముడు వయోభారం వల్ల యువరాజు ప్రసేనుడికి రాజ్యభారం అప్పగించి, విశ్రాంతి తీసుకోవాలనుకున్నాడు. ప్రసేనుడు కొద్దిరోజుల క్రితమే విద్యాభ్యాసం పూర్తి చేసుకుని రాజధాని చేరాడు. గురు కులంలో అతడు రాజనీతి శాస్త్రంలోను, గణిత శాస్త్రంలోను విశేష ప్రజ్ఞ కనపరచి, ఆచార్యుల మెప్పు పొందాడు. ప్రసేనుడికి పట్టాభిషేకం చేయడానికి అన్ని

కొల్లూరి సోమశంకర్

ఏర్పాట్లు చేశారు. యువరాజు కొరకు నవరత్నాలు పొదిగిన ఒక స్వర్ణ కిరీటాన్ని తయారు చేయాల్సిందిగా మహారాజు, రాజధానిలోని ప్రముఖ స్వర్ణకారుడు శివానందుడిని కోరాడు. రాజ మకుటాలను తరతరాలుగా శివానందుడి వంశీకులే తయారు చేస్తున్నారు. వారి కుటుంబం నిజాయితీకి, విశ్వసనీయతకు ప్రసిద్ధి గాంచింది.

శివానందుడు ప్రసేనుడి కొరకు కిరీటాన్ని రూపొందించసాగాడు. అతడి సమీప బంధువు రత్నాకరుడు కూడ స్వర్ణకారుడే. అతడు రాజధానిలోనే ఉండేవాడు. కిరీటం తయారుచేసే అవకాశం ఈసారి తనకు ఇవ్వవలసిందిగా రత్నాకరుడు శివానందుడిని కోరాడు. అతడి నిజాయితీపై నమ్మకం లేని శివానందుడు అందుకు తిరస్కరించాడు. తన కుటుంబంతో సంబంధాలు తెంచుకుంటానని రత్నాకరుడు హెచ్చరించినప్పటికీ, శివానందుడు చలించలేదు. తరతరాలుగా తమ వంశానికి లభిస్తున్న ఈ గౌరవాన్ని వదులుకోడం తనకిష్టం లేదని రత్నాకరుడితో ఖచ్చితంగా చెప్పాడు. నిర్ణీత గడువులోగా ఒక అద్భుతమైన కిరీటాన్ని రూపొందించి, మహారాజుకి సమర్పించాడు.

శివానందుడిపై అక్కసు పెంచుకున్న రత్నాకరుడు, అతడిని పరాభవించాలని నిర్ణయించుకున్నాడు. అందుకు ఒక పన్నాగం పన్నాడు. బరువును ఏ సిబ్బిలో పెట్టినా తప్పుగా తూచేటి ఒక త్రాసును రూపొందించాడు. తనకు పరిచయస్తుడైన పొరుగు రాజ్యపు ఇంద్రజాలికుడు ప్రభాకరుడిని కలిశాడు. ఏం చేయాలో, అతడికి వివరించి, కానుకగా వంద బంగారు నాణాలు ఇచ్చాడు. కుట్ర విఫలమైతే తాను శిక్షింపబడతానని ప్రభాకరుడు భయపడ్డాడు. రత్నాకరుడు అతడికి ధైర్యం చెప్తూ, ఒకవేళ త్రాసు లోప భూయిష్టమైనదని ఎవరైనా పసిగట్టినా, అది ఇంద్రజాల ప్రదర్శనలో భాగమని నమ్మించవచ్చని నచ్చచెప్పాడు.

పట్టాభిషేక మహోత్సవం సందర్భంగా రాజధాని నగరాన్ని సుందరంగా తీర్చి దిద్దారు. ప్రజల వినోదం కోసం కుస్తీ పోటీలు, నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. పట్టాభిషేకం చేసే రోజు రానేవచ్చింది. ప్రభాకరుడు ఆ రోజున సుమూర్తానికి కొన్ని గంటల ముందు రాజస్థానానికి చేరుకుని తన ఇంద్రజాల విద్యను ప్రదర్శించాడు. అతడి గారడీలకీ హస్తలాఘవానికీ సభాసదులందరు ఎంతో సంతోషించారు. మహారాజు కూడ ప్రసన్నుడై, ప్రభాకరుడిని ఏదైనా బహుమతి కోరుకోమన్నాడు. అందుకు ప్రభాకరుడు...

"ప్రభూ! నేడెంతో సుదినం! యువరాజుకు మకుటధారణ జరుగుతున్న శుభ ఘడియలు. కాబట్టి యువరాజు కొరకు తయారుచేసిన కిరీటాన్ని వరహాలతో తూచి, ఎన్ని వరహాలు తూగితే వాటిని నా కివ్వండి"... అని కోరాడు.

అందుకు అంగీకరించిన మహారాజు ఒక త్రాసును తెమ్మని భటులను ఆదేశిస్తుండగా, ప్రభాకరుడు కలుగ జేసుకుని...

"క్షమించండి మహారాజా! నా వద్ద మా గురువుగారు ప్రసాదించిన మహిమాన్వితమైన త్రాసు వుంది. యువరాజు కిరీటాన్ని అందులో తూచవల్సిందిగా నా కోరిక" అని పలికాడు. అందుకు సరేనన్న మహారాజు కోశాగారం నుంచి వరహాలను తెప్పించాడు. ఒక సిబ్బిలో కిరీటాన్ని, మరో సిబ్బిలో

వరహాలను ఉంచి తూకం వేయగా, కిరీటం బరువు 576 వరహాలుగా తేలింది. సభలోనే వున్న శివానందుడు వెంటనే లేచి ఆ తూకానికి అభ్యంతరం తెలిపాడు. కిరీటం బరువు ఇంకా ఎక్కువని చెప్పాడు.

''మకుటం సృష్టికర్తే స్వయంగా అభ్యంతరం చెప్తుంటే, మరోసారి తూచడంలో తప్పులేదు...'' అంటూ ప్రభాకరుడు ఈసారి మకుటాన్ని మొదట ఉంచిననిబ్బిలో కాకుండా, మరోవైపు సిబ్బిలో ఉంచి తూచాడు. ఆశ్చర్యకరంగా ఈసారి మకుటం బరువు 676 వరహాలుగా తూగింది. సభాసదులందరు ఆశ్చర్యపోయారు. బహుమతిగా ప్రభాకరుడికి ఎన్ని వరహాలివ్వాలనేది సమస్యగా తయారైంది. అంతలో కిరీటంలో ఏదో దోషమున్నదని రత్నాకరుడు ఆరోపించాడు. దాంతో సభలో ఒక్కసారిగా కలకలం రేగింది. అందరిని నిశ్శబ్దంగా వుండాల్సిందిగా మహామంత్రి ఆజ్ఞాపించాడు. తన కుయుక్తి పారినందుకు రత్నాకరుడు సంతోషించగా, ఊహించని విధంగా తన నిజాయితీపై ఆరోపణలు రావడంతో శివానందుడు నివ్వెరపోయాడు. అంతలో యువరాజు బాల్యమిత్రుడు, ఆ దేశపు మహామంత్రి కుమారుడైన శ్రీముఖుడు సభలో ప్రవేశించి యువరాజుతో రహస్యంగా ఏదో చెప్పాడు. వెంటనే ప్రసేనుడు ఆసనం నుంచి లేచి... ''తండ్రీ, ఈ తరాజు మహిమగలది. కాబట్టి ఈ సమస్య పరిష్కారానికై, నేను నా ఇష్టదైవమైన కాళికామాత సహాయాన్ని అర్థించదలచాను...'' అంటూ కళ్ళు మూసుకుని ధ్యానమగ్నుడయ్యాడు. కొన్ని ఘడియల అనంతరం కనులు తెరచి...

''మహారాజా, సభాసదులారా, కిరీటంలో దోషమేదీ లేదని దేవి తెలిపింది. కిరీటం బరువుకి సమానమైన 624 వరహాలను ప్రభాకరుడికి బహుమతిగా ఇవ్వాల్సిందిగా ఆదేశించింది...'' అని అన్నాడు. దైవాజ్ఞ, రాజాదేశం మేరకు ప్రభాకరుడికి 624 వరహాలు అందజేశారు. పట్టాభిషేక మహోత్సవం సజావుగా సాగిపోయింది. రాజ్యాభిషేకం పూర్తికాగానే ప్రసేనుడు శివానందుడిని, రత్నాకరుడిని, ప్రభాకరుడిని తన ప్రత్యేక అతిథులుగా ప్రకటించి, వారిని మరో రోజు రాజాస్థానంలో ఉండాల్సిందిగా కోరాడు. మర్నాడు తన అంతరంగికమందిరంకి వారి ముగ్గురిని ఆహ్వానించాడు. అక్కడ అప్పటికే త్రివిక్రముడు, మహామంత్రి, శ్రీముఖుడు ఆసీనులై వున్నారు. ప్రసేనుడు ముందుగా శివానందుడితో... ''శివానందా, మకుటం విషయంలో సభలో ఎంతో కలకలం రేగినప్పటికీ ఉద్రేకపడకుండా, సంయమనం పాటించి మీ గౌరవం నిలుపుకున్నారు. అంతటి అద్భుతమైన కిరీటాన్ని రూపొందించినందుకు మీకు నా కృతజ్ఞతలు''... అంటూ అతడికి ప్రత్యేక బహుమతినిచ్చి పంపాడు.

తర్వాత రత్నాకరుడితో... ''నీ కుట్ర



విఫలమైంది. ఆ త్రాసునం నువ్వే లోపభూయిష్టంగా తయారుచేశావని మాకు తెలిసింది. అసూయాపరుడివై, ఓ నిజాయితీపరుడిని అవమానించాలని చూశావు. అందుకు నీకు శిక్ష తప్పదు...'' అంటూ రత్నాకరుడిని కారాగారంలో వేయించాడు. చివరగా ప్రభాకరుడితో... ''అయ్యా, మీ ఇంద్రజాల ప్రదర్శనకు మేమెంతో ఆనందించాము. మీరు మా దేశంలో ఒక ద్రోహికి సహాయం పడాలనుకున్నారు. అందుకు మీరు శిక్షార్హులు. కాని తమరు కళాకారులైనందున, పరదేశీయులైనందున ఈసారికి మిమ్మల్ని క్షమిస్తున్నాను. మరోసారి మా దేశంలో అడుగుపెట్టవద్దు...'' అంటూ కఠినంగా హెచ్చరించి పంపాడు. వారు ముగ్గురు నిష్క్రమించిన తర్వాత, త్రివిక్రముడు తన కుమారుడితో... ''ఇంత చిన్న వయసులోనే దైవకృప పొందిన నీవు ధన్యుడివి నాయనా...'' అని అన్నాడు పుత్రవాత్సల్యంతో: బదులుగా ప్రసేనుడు... ''క్షమించండి నాన్నా! నిన్న జరిగిన సంఘటనలో దైవ ప్రమేయం ఏమీలేదు. తన త్రాసు మహిమగలదని ప్రభాకరుడు చెప్పడంతో, నేను కూడ దైవసహాయం అర్థించినట్లు ప్రకటించాను అంతే! కిరీటం బరువును ఆ త్రాసు వేర్వేరుగా సూచించడంతో నాకు మొదటే అనుమానం వచ్చింది. ఇంతలో శ్రీముఖుడు వచ్చి నా అనుమానం నిజమని తెలిపాడు. పట్టాభిషేకానికి

★ విద్యా రహస్యం విద్యార్థిని గౌరవించడమే!

– ఎమర్సన్

కొన్ని గంటల ముందు రాజసభా మందిరంలోని ఓ గదిలో శివానందుడికీ, రత్నాకరుడికీ వాదన జరిగింది. కిరీటాన్ని రూపొందించింది తానేనని చెప్పకపోతే, శివానందుడిని ఇక్కట్ల పాలుచేస్తానని రత్నాకరుడు బెదిరించడం శ్రీముఖుడు విన్నాడు. దాన్నే నాకు రహస్యంగా తెలియజేశాడు. అందుకు శ్రీముఖుడికి నా అభినందనలు. ఇది వరహాల సంఖ్య విషయానికి వస్తే, ఇలాంటి సందర్భాలలో, వేర్వేరుగా తూగిన వరహాల సంఖ్యను గుణించి, వచ్చిన సంఖ్యకు వర్గమూలం కడితే వచ్చే సంఖ్య సరైన బరువును సూచిస్తుందని గణిత శాస్త్రంలోని ఓ సూత్రం తెలియజేస్తుంది. ఆ సూత్రం ఆధారంగానే కిరీటం బరువును 624 వరహాలుగా నిర్ధారించాను. ఆ సంఖ్య సరైనదా, కాదా అనేది ఇప్పుడే పరీక్షిద్దాం...'' అంటూ కిరీటాన్ని ఓ త్రాసు లో తూకం వేయించాడు. అప్పుడు కిరీటం ఖచ్చితంగా 624 వరహాలు తూగింది. ప్రసేనుడి తెలివికి, సమయస్ఫూర్తికి త్రివిక్రముడు ఎంతో సంతోషించాడు.

ప్రసేనుడి పాలనలో ప్రజలు ఎంతో సుఖంగా వున్నారు.